క్లుప్తంగా

తీరిన విద్యుత్ సమస్య



విద్యుత్ లైన్ ఫీడర్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

కొందుర్గు: మండలంలోని ఆగిర్యాల సబ్‌స్టేషన్ నుంచి తంగెళ్లపల్లి గ్రామానికి నూతనంగా ఏర్పాటు చేసిన 11 కేవీ విద్యుత్ లైన్ ఫీడర్‌ను గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి ప్రారంభించారు. కొత్తలైన్ ఏర్పాటుకు అడిగిన వెంటనే రూ.35 లక్షలు మంజూరు చేసి పనులు పూర్తి చేయించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఈ సందర్భంగా స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌గౌడ్, బాల్‌రెడ్డి, సతీశ్‌కుమార్, ఖలీద్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

శంషాబాద్ డీసీపీ రాజేశ్



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీసీపీ రాజేశ్

కొందుర్గు: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం కొందుర్గు పోలీసుస్టేషన్‌లో ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో ప్రజలు ముందుకొచ్చి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం దాతలను ఆయన అభినందించారు. అనంతరం పోలీసుస్టేషన్‌లో పలు రకాల రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏసీపీ లక్ష్మీనారాయణ, షాద్‌నగర్‌రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రవీందర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



గ్రామస్తులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని గోపులారంలో మాజీ సర్పంచ్ పాడువు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో హైదరాబాద్‌కి చెందిన హ్యాపీ విజన్ లేజర్ కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించగా.. గ్రామస్తుల నుంచి పెద్దఎత్తున స్పందన లభించింది. ఈ సందర్భంగా మహిళలు, వృద్ధులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు.

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి

కొందుర్గు: సామాన్యుడు కొనలేని స్థాయికి నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతున్నాయని వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి వెంకటేశ్వరమ్మ అన్నారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వంట నూనె, గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. రోజు కూలీ పనులు చేసి జీవనం సాగించే కార్మికుడి జీవనం కష్టసాధ్యంగా మారిందన్నారు. పేదల బతుకులు బాగుచేసేందుకు ప్రభుత్వం కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభుదాసు, పార్వతమ్మ, నర్సమ్మ, బాలయ్య, లింగయ్య పాల్గొన్నారు.

బీసీ జేఏసీ బంద్‌కు ఏఐఎస్ఎఫ్ మద్దతు

షాద్‌నగర్‌రూరల్: బీసీ రిజర్వేషన్ సాధనకు బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ(జేఏసీ) ఈ నెల 18న చేపట్టనున్న బంద్‌కు ఏఐఎస్ఎఫ్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పవన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమం మాదిరిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. హైకోర్టు స్టే విధించడంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయని, దీనికి కేంద్ర ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వే నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్రానికి పంపించినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కేంద్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్‌లను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ రిజర్వేషన్ సాధనకు బీసీ బంద్‌కు పూర్తి మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు.

నల్లబారిన తెల్లబంగారం

- అధిక వర్షాలతో దిగుబడిపై ప్రభావం
- పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని రైతన్నల ఆవేదన
- ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని వేడుకోలు



అంతారం వద్ద ఎర్రబారిన పత్తిపంట

షాబాద్: అధిక వర్షాలతో తెల్ల బంగారంగా పిలుచుకునే పత్తి పంట నల్లబారిపోయింది. వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పత్తి పంట మరో 10 రోజుల్లో చేతికి రానుంది. రెండేళ్లుగా తక్కువ దిగుబడులు రావడం, సరైన ధర కరువైంది. ఈ సారైనా మద్దతు ధర వస్తుందేమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. చేవెళ్ల డివిజన్‌లో ఈ సంవత్సరం 31,220 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. షాబాద్ మండలంలో 13,231 ఎకరాలు, మొయినాబాద్ మండలంలో 1,363 ఎకరాలు, చేవెళ్ల మండలంలో 10,931 ఎకరాలు, శంకర్‌పల్లి మండంలో 5,695 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. ఈ సారి అధిక వర్షాలు తమను ముంచాయని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. అయితే పత్తి పంట ఏపుగా పెరిగి కాత, పూత బాగానే ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పత్తి ఆకులు ఎర్రబారుతున్నాయని, కాయలు మురిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

పెరిగిన ఖర్చులు..

గతంలో కంటే ఈ ఏడాది పత్తి పంట సాగుకు పెట్టుబడులు పెరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఎకరా పత్తి సాగు చేసేందుకు రూ.50 వేల పైనే ఖర్చు అవుతోంది. ఈ ఏడాదిలో అధిక వర్షాలతో చేనులో నీరు నిలిచి మొక్కలకు తెగుళ్లు సోకాయి. తెగుళ్ల నివారణకు వివిధ మందులు పిచికారీ చేసేందుకు మరిన్నీ అదనపు ఖర్చులు అయినట్లు రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల పత్తి చేలల్లో మొక్క కింది భాగంలో కాయలు మురిగిపోయాయని దీంతో దిగుబడి తగ్గే అవకాశాలున్నాయి. సాధారణంగా ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల పత్తి రావాల్సి ఉండగా, ప్రస్తుతం 6 నుంచి 8 క్వింటాళ్లు మాత్రమే వచ్చే అవకాశం ఉందని పలువురు అన్నదాతలు ఆరోపిస్తున్నారు.

నిలకడగా లేని ధరలు

రెండేళ్లుగా పత్తి ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల కిందట పత్తి పంట క్వింటాల్‌కు ధర రూ.10 వేలు పలికింది. ఆ తర్వాత రూ.7 వేలు నుంచి రూ.8 వేల వరకు పలికింది. ధర పెరుగుతుందనే ఆశతో చాలా మంది ఇళ్లలో పత్తిని నిల్వ చేసుకొని నష్టయారు. ఈసారి పెరిగిన పెట్టుబడులకు రూ.10వేల మద్దతు ధర ఉంటే తప్పా మేలు జరగదని రైతులు పేర్కొంటున్నారు.



తిర్మలాపూర్‌లో మురిగిపోతున్న పత్తి కాయలు

ఖర్చులు పెరిగాయి



పది ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశా. పెట్టుబడికి గాను రూ.6 లక్షలు ఖర్చు అయ్యింది. ఇటీవల భారీ వర్షాలతో పంటకు తెగుళ్లు సోకడంతో మొక్కల్లో ఎదుగుదల లోపించింది. గతంలో కంటే ఈసారి ఖర్చులు పెరిగాయి. ధర పెరిగితేనే గిట్టుబాటు అవుతుంది.

–కడుమూరు సుదర్శన్, రైతు, తిర్మలాపూర్

మద్దతు ధర కల్పించాలి



రెండేళ్లుగా పత్తికి మద్దతు ధరలు తగ్గుతున్నాయి. రోజు రోజుకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఈసారి ఆశించిన దిగుబడులు వచ్చేలా లేవు. ధర పెంచితేనే పత్తి రైతులకు మేలు జరుగుతుంది.

–అంజయ్య, రైతు, మక్తగూడ

భారీ వర్షాలే ప్రధాన కారణం



మండలంలో పత్తి చేన్లు దెబ్బతినడానికి ప్రధాన కారణం భారీ వర్షాలే. వర్షాలతో భూమిలో తేమ శాతం ఎక్కువ ఉండడంతో మొక్క సరిగా ఎదగలేదు. అధిక వర్షాలతో పత్తి పంటలు ఎర్రబారిపోయాయి.

– దండెం విజయచంద్ర, మండల వ్యవసాయశాఖ అధికారి

‘సదర్’కు నిధులు మంజూరు చేయాలి

యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్‌యాదవ్



మాట్లాడుతున్న దామోదర్‌యాదవ్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో సదర్ ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని యాదవ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సదర్ పండుగను అధికారికంగా గుర్తించడం హర్షణీయమన్నారు. యాదవ సమాజం ఈ నెల 19న ఇందిరా పార్కు వద్ద ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సదర్ ఉత్సవాలను బోనాలు, బతుకమ్మ పండగల తరహాలో నిర్వహించాలన్నారు. ఉత్సవ నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించాలని, వేడుకలకు ప్రభుత్వం రూ.10కోట్లను మంజూరు చేయాలన్నారు. ఉత్సవ వేదికలను ఏర్పాటు చేసేందుకు యాదవ సంఘాలకు ప్రభుత్వం రూ.5 లక్షలు, ఊరేగింపులకు రూ.3లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాస్థాయిలో ఉత్సవాల నిర్వహణ బాధ్యత కలెక్టర్లకు ఇవ్వాలని కోరారు. యాదవ సంఘాల నాయకులందరూ ఏకతాటిపైకి వచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యాదవ సంఘం నాయకులు అంజన్‌కుమార్‌యాదవ్, తిరుమలేశ్‌యాదవ్, చెన్నకేశవులుయాదవ్, సాయికుమార్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను పాఠశాలలకు దూరం చేయొద్దు

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు



కాకునూర్ పాఠశాల వద్ద మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కేశంపేట: తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను పాఠశాలకు దూరం చేయొద్దని, బడులను తనిఖీ చేసే విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని రేళ్లగండితండా, గుట్టల గడ్డతండా, దత్తాయిపల్లి, దేవునిగుడితండా, రాగ్యతండా, పోమాల్‌పల్లి, కాకునూర్ తదితర గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను యూటీఎఫ్ సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల తనిఖీల కోసం ఉపాధ్యాయులను పంపించొద్దన్నారు. వీరి స్థానంలో ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు, డీఈఓలను శాశ్వత ప్రతిపాదికన నియమించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిని మెరుగుపర్చుకోవటానికి టీచర్లను తరగతి గదులకే పరిమితం చేయాలన్నారు. అలా కాకుండా తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను బడులకు దూరం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షురాలు జ్యోతి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు వినీత్‌గౌడ్, కార్యదర్శి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు జోనల్‌స్థాయి ఖోఖో టోర్నమెంట్

చేవెళ్ల: ఈ నెల 18వ తేదీన చేవెళ్లలోని ఆదర్శ పాఠశాల గ్రౌండ్‌లో శంకర్‌పల్లి జోనల్ స్థాయి 69వ స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఖోఖో టోర్నమెంట్ పోటీలు, సెలక్షన్‌లు జరుగుతాయని జోనల్ కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 69వ ఎస్‌జీఎఫ్ జోనల్‌స్థాయి టోర్నమెంట్‌లో భాగంగా ఖోఖోపోటీలు చేవెళ్లలో నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలు చేవెళ్ల, శంకర్‌పల్లి ఎంఈఓలు పురన్‌దాస్, అక్బర్ ఆధ్వర్యంలో కొనసాగుతాయని తెలిపారు. రెండు మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చని, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామని వెల్లడించారు. క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పోటీలలో పాల్గొనే ఆయా పాఠశాలల విద్యార్థులు బోనోఫైడ్, ఆధార్ కార్డు, ఎలిజిబిలిటీ ఫారం నింపి ఇవ్వాలన్నారు. ఇతర వివరాలకు 9912183921ను సంప్రదించాలని కోరారు.

సొంత డబ్బులతో రోడ్డుకు మరమ్మతులు



గుంతలను పూడ్చివేయిస్తున్న యువకులు

మొయినాబాద్: ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు.. అని ఎదురుచూడకుండా తమ ఊరి గుంతల రోడ్డును యువకులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి బాగుచేసుకున్నారు. సొంత డబ్బులతో కాంక్రీట్ వేయించి గుంతలు పూడ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించకపోవడంతో గ్రామ యువకులే రోడ్డు బాగుచేసుకోవడానికి నడుం బిగించారు. సొంత డబ్బులతో గురువారం కాంక్రీట్ తెప్పించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. కార్యక్రమంలో యువకులు బండారు ఓంరెడ్డి, సరికొండ వీరారెడ్డి, మండడి రాఘవరెడ్డి, అబీబ్‌ఖాన్, చేగూరి ఆనంద్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



సేవా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, జనార్దన్‌రెడ్డి

సర్పంచ్‌ల సంఘం తాజా మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సర్పంచ్‌ల సంఘం తాజా మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కనకమామిడి మాజీ సర్పంచ్ పట్లోళ్ల జనార్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కనకమామిడిలో నగరంలోని బాగ్‌లింగంపల్లిలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు చేపట్టిన జాతీయ సేవా కార్యక్రమం ఐదోరోజుకు చేరింది. ఇందులో భాగంగా గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయ పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు తొలగించి, రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ సరోజావివేకానంద్, ప్రిన్సిపాల్ మట్ట శేఖర్, ప్రోగ్రామ్ అధికారి శ్రీధర్, కుమారస్వామి, శ్రీనాథ్, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీకాంత్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, జగదీశ్వర్‌చారి, దయాకర్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

సర్ధార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి



బోరు వేయిస్తున్న సురేందర్‌రెడ్డి, నాయకులు

షాబాద్: గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లిలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ఆయన కొత్తగా బోర్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మిషన్ భగీరథ నీరు రానప్పుడు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులతో మాట్లాడి బోరు వేయించినట్లు స్పష్టం చేశారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేస్తోందన్నారు. పార్టీ కార్యకర్తలంతా ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు కలిసి పనిచేస్తేనే విజయ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకొని దశలవారీగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పీసరి వెంకట్‌రెడ్డి, పీసరి సతీశ్‌రెడ్డి, కుమ్మరి వేణు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె



ఇంటింటి సర్వే చేపడుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

షాద్‌నగర్‌రూరల్: గ్రామాల్లో ప్రజలు వందశాతం అక్షరాస్యత సాధించినప్పుడే పల్లెలు అభివృద్ధి చెందుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనంలో గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫ్రోజ్ జహాన్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శీతాకాల శిబిరం నిర్వహిస్తున్నారు. గురువారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అక్షరాస్యత, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై ఇంటింటి సర్వేను నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ శిబిరానికి ప్రిన్సిపాల్ హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ఆహారంలో ఆకుకూరలు, చిరుధాన్యాలు, పప్పులు ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రజలందరూ అక్షరాస్యతను సాధించేందుకు కృషి చేయాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ముంతాజ్, అధ్యాపకులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆడపడుచులకు అండగా నిలిచిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లేడు చౌదరిగూడ మండలానికి చెందిన 69 మందికి, కొత్తూరు మండలానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.80లక్షల విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, జనిగె జగన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్ యోగేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని క్రిస్టల్ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ యోగేశ్, విద్యుత్‌శాఖ ఏఈ ప్రదీప్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో గతంలో వేసిన డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనందున పెద్దఎత్తున దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పాత లైన్‌ని తొలగించి కొత్తలైన్ వేయాలని, సీసీరోడ్లు, పిచ్చిమొక్కల తొలగింపు, కుక్కలకు స్టెరిలైజేషన్ చేయాలని మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌ను కోరారు. అదేవిధంగా లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీవాసుల సమస్యలపై ఇరువురు అధికారులు సానుకూలంగా స్పందించి, త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు విఠలయ్య, ప్రతాప్‌రెడ్డి, అశోక్, వరకుమార్, ప్రశాంత్, శ్రీశైలం, లీల ప్రసాద్, రాంచంద్రయ్య, విఠల్‌రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు అమలు చేసేవరకు పోరాటం



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకుడు రవీందర్

నిరాహార దీక్షలో సాధన సమితి సభ్యులు

షాబాద్: బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేవరకు పోరాటం ఆగదని బీసీ రిజర్వేషన్ల సాధన సమితి సభ్యులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో చేపట్టిన నిరాహార దీక్ష ఐదోరోజుకు చేరింది. ఈ సందర్భంగా కురుమ మండల అధ్యక్షులు మద్దూరు పాండు, రాపోల్ నర్సింలు, బర్కసాయిలు, గుండాల శ్రీనివాస్, మద్దూరు సత్తయ్య, శివ దీక్షలో కూర్చొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 18వ తేదీన తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు బీసీలు భారీగా తరలిరావాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్‌లో బీసీ నాయకులు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రిజర్వేషన్ల సమితి సభ్యులు మద్దూరు మల్లేశ్, రవీందర్, వెంకటయ్య, దర్శన్, సత్యనారాయణ, రాజేందర్, సందీప్, బీరయ్య, కుమార్, కిష్టయ్య, గోపాల్, శ్రీశైలం, రవి, బందయ్య తదితరులు ఉన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక

ఆమనగల్లు: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆమనగల్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. మండలంలోని ఆకుతోటపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు పౌష్టికాహారం గురించి వివరించారు. సమావేశంలో రాధిక మాట్లాడుతూ.. పౌష్టికాహారం తినడంతో ఆరోగ్య సమస్యలు దరి చేరవన్నారు. ఆకుకూరలు తీసుకోవడంతో ఐరన్ సమృద్ధిగా లభిస్తుందన్నారు. చిరుధాన్యాలు, ఆయా సీజన్‌లలో లభించే పండ్లు ఎక్కువగా తినాలని సూచించారు. ఐసీడీఎస్‌ల ద్వారా అందించే బాలామృతంలో అనేక పోషక విలువలు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మి, నాగశిరోమణి, అలివేలు, సారమ్మ, రాములమ్మ, ముత్యాలమ్మ, భారతమ్మ, సువర్ణ, లక్ష్మి, సాలి, ఎమ్మార్పీ షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.